
# సావిత్రమ్మగారి స్వర్గయాత్ర



చిరంజీవి ...

మీ అమ్మ మీ అందరినీ ఆశీర్వదించి వ్రాయునది.

నా పరిస్థితి 'ఊరు పొమ్మంటోంది- కాడు రమ్మంటోంది!' అన్నవిధంగా ఉన్న విషయం మీ అందరికీ తెలుసు. దైవానుగ్రహం వల్ల ఇప్పటివరకూ పడూతూ లేస్తూనే ఎలాగో లాగు నావంట నేను చేసుకుని తింటూ, నా పనులు నేనే చేసుకుంటూ ఎవరికీ భారంగా లేకుండా నెట్టుకొస్తున్నాను.

ఏ క్షణాన ఎలా వుంటుందో! ఆ చావు ఎవరికీ చెప్పిరాదు. అయితే అదృష్టవశాత్తూ నే వెళ్లిపోయే సమయం ముందుగానే తెలిసింది.

ఆమధ్య కపిలేశ్వరపురం సిద్ధాంతిగారు కలిశారు. మీ నాన్నగారికి జ్యోతిషం నేర్పింది ఆయనే. ఆయన చెప్పినదానికి తిరుగుండదు. చెప్పినవన్నీ తు.చ. తప్పకుండా క్షణం తేడా లేకుండా జరుగుతాయి. మీ నాన్నగారు ఏ రోజున, ఎన్ని గంటలకు, ఏ వ్యాధి వల్ల పోతారో నాలుగేళ్లు ముందుగా చెప్పారు. ఆయన సరిగ్గా ఆలాగే పోయారు.

ఇదొక్కటే కాదు.., ఆయన చెప్పినవన్నీ అక్షరాలా జరిగాయి.

ఆయన చెప్పారు- నేను ఈ మకర సంక్రాంతి పర్వదినాన... సరిగ్గా మధ్యాహ్నం 12:35కి చివరిశ్వాస విడుస్తానని, ముహూర్తం కూడా పెట్టారు. ఆరోజు ప్రొద్దుటినుంచీ కొంచెం నలతగా ఉంటుందనీ, తెలివి కూడా తప్పవచ్చుననీ, మళ్లీ కళ్లు తెరవకుండానే కన్ను మూసేస్తాననీ చెప్పారు.

ఆయన జ్యోతిషం మీద నాకు పూర్తి నమ్మకం ఉంది. అలాగని- చనిపోతానని భయం లేదు. బతికినన్నాళ్లూ బాగానే బ్రతికాను. ఏదో- ఆ మారాజు ఇచ్చిన పొలం, డబ్బూ ఉన్నాయి. తరతరాలుగా వస్తూన్న నగలూ ఉన్నాయి. వీటితో కాలక్షేపం చేస్తూ ఎవరికీ బరువుకాకుండా వీలునామా రాస్తున్నాను.

ఇంతకీ- నేను చెప్పేదిమిటంటే... నేను ఎలాగూ సంక్రాంతినాడు పోతాను కనుక, మీరందరూ నాలుగురోజులు ముందే వస్తే- కొడుకులూ, కోడళ్లు, కూతుళ్లూ, అల్లుళ్లు, మనవళ్లు... అందరితో నాలుగురోజులైనా సంతోషంగా గడిపానన్న తృప్తి ఉంటుంది.

అందుకే... మీ అందరికీ బాగా ముందుగా రాస్తున్నాను. అందరూ తప్పక రావలసింది. ఇక్కడ మీకు దేనికీ ఇబ్బందీ ఉండదు. పప్పులు, బియ్యం, అన్నీ తెప్పించి ఉంచుతాను. పాలు, పెరుగులకు కొరత ఉండదు. వంట మనిషిని కూడా పెట్టొచ్చు కాని, నా కోడళ్ల, కూతుళ్ల చేతివంట తినాలని కోరికగా ఉంది.

అందువల్ల మీకు ఏది కావలసినా చేసుకుంటూ నాకింత పెట్టేచాలు. నా పొట్టకెంత కావాలి! ఏదో నా వాళ్ళ చేతివంట తినాలని కోరిక తప్ప?!

వెళ్లేముందు నా దగ్గరున్నదేదో నాకు తోచినట్లు ఇచ్చి పోతాను. నా తర్వాత అనుభవించవలసిన వాళ్ళు మీరేగా!

మళ్లీ మళ్లీ రాస్తున్నాను. మీరంతా తప్పక రావాలి.

ఇట్లు

మీ అమ్మ.

'చిరంజీవి' అన్న సంబోధన తర్వాత పేరు, వరస మారినా అదే ఉత్తరం నకళ్ళు సావిత్రమ్మగారి సంతానం అందరికీ- అంటే... ముగ్గురు కూతుళ్లు, ముగ్గురు కొడుకులకు వెళ్లాయి.

ఆవిడ కోరుకున్నట్లు- సంక్రాంతికి నాలుగు రోజులు ముందుగానే అందరూ బిలబిలలాడుతూ వచ్చారు. పల్లెటూళ్లో పాతకాలం నాటి కొంపాయే- పాతిక మందొచ్చినా ఇరకాటం అనిపించలేదు. పిల్లలైతే వానర మూకలాగా దొడ్లో వున్న జామచెట్టు, రాచ ఉసిరి చెట్ల మీద పడ్డారు.

* * *

ఆదివారం , మకర సంక్రాంతి పుణ్యదినం రానే వచ్చింది.

ఆరోజు ఉదయం నుంచే సావిత్రమ్మగారు మగత మగతగా ఉన్నారు.

వీధి వాకిట్లో ఇంటికి అటూ ఇటూ పెద్దపెద్ద అరుగులు ఉన్నాయి. భజన బృందాన్నీ, సన్నాయి మేళం వాళ్ళనీ పిలిపించారు. వాళ్ళలో భజన బృందం ఒక అరుగు మీద, సన్నాయి మేళగాళ్ళు రెండవ అరుగు మీదా కూర్చొని ఉన్నారు. ఇంట్లోని వారికీ, బయటివారికీ అందరికీ కాఫీ, ఫలహారాలు అందాయి..

ఉదయం తొమ్మిది గంటలు అవుతోంది. సావిత్రమ్మగారి గదికి ఇవతల కూర్చొని బ్రాహ్మణులు వేదపారాయణం, గీతాగానం చేస్తున్నారు.

బయటి అరుగు మీద సన్నాయివాళ్లు సన్నాయిల్లోంచి పీకలు బయటకు తీసి ఉమ్మిని వంచేసి, గుడ్డతో తుడిచి మళ్లీ పెట్టి 'పీపీప్...' అంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు.

"మీరు కాసేపు ఉండండయ్యా... మేము కొంచెంసేపు భజన చేస్తాం!" అని వెంటనే భజన బృందం వాళ్ళు రామదాసు కీర్తనలు అందుకున్నారు. ఇంకొకాయన ఊడి పడిపోతుందా... అన్నట్లు తలని ఆడించి మద్దెలను బాదడం మొదలుపెట్టాడు. మిగిలిన వాళ్ళందరూ తాళాలను ఎడాపెడా బాదేస్తూ భజన చేయసాగారు.

ఓ అరగంట అయ్యేసరికి వాళ్ళకి అలసట వచ్చింది. అందరూ తలోగ్లాసుడి మంచినీళ్ళు త్రాగి విశ్రాంతి తీసుకోసాగారు.

వాళ్ళు ఆపగానే- సన్నాయి వాళ్ళు జోరందుకున్నారు. అక్కడ జరగబోయేది చావన్న విషయం మరిచిపోయి, పెళ్లికి వాయించినట్లు పోటీలు పడి వాయించసాగారు. డోలువాళ్ళు 'నీ డొక్క చీలుస్తా' మన్నట్లు బాదడం మొదలుపెట్టారు. ఇలా కొంతసేపు సన్నాయివాళ్ళు, మరికొంతసేపు భజన బృందం పోటీలు పడి హోరెత్తించసాగారు.

సమయం పదకొండు గంటలు కావస్తోంది.

పురోహితుడు పేరయ్యశాస్త్రి వచ్చాడు. వస్తూనే సావిత్రమ్మగారి పెద్దకొడుకు ప్రభాకరం దగ్గరికి వెళ్లి -

"ఏమండీ... ఇంక గట్టిగా గంటన్నర కూడా లేదు- రాగిపాత్ర, ఉద్ధరిణి, తులసితీర్థం సిద్ధం చేశారా?" అని అడిగాడు.

"అన్నీ సిద్ధంగానే ఉన్నాయండి!" అన్నాడు ప్రభాకరం.

"మరి.., కొత్త సైనుగుడ్డ, పాడె సామానులు అన్నీ ఏర్పాటుచేశారా? దహనానికి ఏర్పాట్లు జరిగాయా?" అని మళ్లీ అడిగాడు శాస్త్రిగారు.

"అన్నీ చెప్పేవుంచాను. ఆవిడ ఇలా పోవడమేవిటి, అవన్నీ అలా రావడమేమిటి- అన్నీ వెంటవెంటనే జరుగుతాయి" అన్నాడు ప్రభాకరం.

"అలాగైతే అంతా చకచకా జరిగిపోతుంది. ఆవిడ తిన్నగా స్వర్గానికే వెళ్తుంది" అన్నాడు పేరయ్యశాస్త్రి.

ఇంట్లో ఆడవాళ్ళ హడావుడి ఎక్కువగా ఉంది.

ఇంట్లో శవం ఉంటే అది కదిలేదాకా వంట చేయరు. కాని, ఆరోజున ఇంట్లోకి శవం రాబోతోంది. సావిత్రమ్మగారు పోవాలి. ఆ తర్వాత కర్మకాండకు మరో రెండు గంటలు.! ఎంతలేదన్నా నాలుగు దాటుతుంది. అంతవరకూ పిల్లలు ఉండలేరు. అందువల్ల వాళ్ళకి వంటలు చేయించి భోజనాలు పెట్టించారు. పెద్దవాళ్ళకి మాత్రం ఆకలి వేయదా! కళ్లు తిరిగి పడిపోయేటట్లుంటే!! కాని, ఆ సమయంలో భోజనం చేయడం బాగుండదు కనుక ముఖానికి ఇంత విషాదం పులుముకోవాలి. ఎవరైనా పలకరిస్తే కళ్లనీళ్లు తెచ్చుకోవాలి. అందుచేత ఉప్మా చేయించి కొంచెం హెవీ డోసే లాగించేశారు.

మగవాళ్ళు మాత్రం మాటిమాటికీ కాఫీని చప్పరించేస్తున్నారు.

అక్కడి వాతావరణమంతా పండగని లేదా పెళ్లి సందడిని తలపిస్తోంది. కాకపోతే- పట్టుచీరల రెపరెపలు, బంగారు నగల తళతళలూ కనిపించడంలేదు. సూట్లూ, బూట్ల హడావిడీ లేదు. ఇటువంటివి చూసేనేమో- పెద్దవాళ్ళ చావు పెళ్లితో సమానం! అన్న సామెత వచ్చింది.

"ఏమండీ... తులసి తీర్థం ఇలా పట్టండి! ఇంక ఇరవై నిమిషాలే ఉంది. బాబూ- ప్రభాకరంగారూ... ముందుగా మీరు ఉద్ధరిణితో మూడుసార్లు నోటిలో నెమ్మదిగా తులసితీర్థం పోయండి" అన్నాడు పేరయ్యశాస్త్రి.

ప్రభాకర్ అలాగే చేశాడు.

"మీరు ఇంక ఆపండి. తర్వాత మీ తమ్ముళ్ళు ఇద్దర్నీ కూడా పోయమనండి. అమ్మా... అందరూ ఇక్కడే కూర్చోండి. భజన చేసుకుంటుండండి!" అని సూచనలిచ్చాడు శాస్త్రి మళ్ళీ.

సమయం... సరిగ్గా 12 గంటల 32 నిమిషాలు అయింది.

పెళ్ళిలో మంగళసూత్రం కట్టేటప్పుడు మ్రోగినట్లుగా సన్నాయి మేళం జోరుగా మోగసాగింది. భక్త బృందం గరిష్ట శ్రుతిలో భజనలు మొదలుపెట్టింది. ఇంటి జనం గట్టిగా భజనలు చేయసాగారు.

"అయ్యో... ఇంక ఒక్క నిమిషమే ఉంది. ప్రభాకరం గారూ... చివరిసారిగా తులసితీర్థం పోయండి. అదవగానే సాయం పట్టి బయట పడుకోబెడ్తురుగాని! ఇంట్లో ప్రాణం పోతే- నక్షత్రం మంచిది కాకపోతే ఇల్లు ఆర్నెల్లు పాడు పెట్టాల్సివస్తుంది" అన్నాడు పేరయ్యశాస్త్రి.

ప్రభాకరం చివరిసారిగా తల్లి నోట్లో తులసితీర్థం పోశాడు.

సమయం... సరిగ్గా 12:34 అయింది.

"ఇంక సాయంపట్టి ఆవిడ్ని బయట పడుకోబెట్టండి" అన్నాడు శాస్త్రి.

ఒకళ్ళు పరుగున వెళ్ళి బయట ఒక చింకిచాప పరిచారు.

"నారాయణ, నారాయణ..!" అంటూ నలుగురు సాయంపట్టి సావిత్రమ్మగారిని బయట చాప మీద పడుకోబెట్టేశారు.

సన్నాయి మేళం మరీ జోరుగా మోగింది. డోలు దెబ్బలు అదరకొట్టున్నాయి. భజన బృందాలవారు గొంతు చించుకుని మరీ పాడుతున్నారు.

"అమ్మా..!" అంటూ కూతుళ్లూ, "అత్తయ్యా...!" అంటూ కోడళ్లూ, "మామ్మా, అమ్మమ్మా..!" అంటూ మనవలు శోకనాలు మొదలుపెట్టారు. మగాళ్ళు ఉత్తరీయంతో కళ్లు తడుచుకోసాగారు.

"శాస్త్రిగారూ... అంతా అయిపోయిందంటారా?" అని అడిగాడు ప్రభాకరం.

శాస్త్రిగారు సావిత్రమ్మగారి ముక్కు దగ్గర చెయ్యిపెట్టి చూసి, "జీవుడు ఇంకా కొట్టుమిట్టాడుతున్నట్లు శ్వాస ఆడుతోంది" అన్నాడు.

"అదేమిటండీ... 12:45 కావస్తూంటే ఇంకా ప్రాణాలు పోకపోవడం! 12:35కేగా మూహూర్తం?!" అన్నాడు ప్రభాకరం అసహనంగా.

"మీ గడియారాలు తప్పుగా ఉన్నాయో.., ఏమో! అసలు ముహూర్తం సరిగ్గా చెప్పారా?" అనడిగారు శాస్త్రిగారు.

"అన్నీ సరిగ్గానే ఉన్నాయి. మీరే సరిగ్గా చూసినట్టు లేదు. ఉండండి... నేను చూస్తాను" అంటూ తల్లి గుండెల మీద చెయ్యివేసీ, ముక్కు దగ్గర వేలుపెట్టీ చూశాడు ప్రభాకరం.

"ఇదేమిటీ... బ్రతికే ఉందే! వారి జ్యోతిషం తప్పినట్లా?!" అని చిరాకుపడ్డాడు.

ఈ మాటలు వినబడగానే భజన బృందం పాటలు ఆపేశారు. మేళగాళ్లు సన్నాయిలనూ దింపేశారు. ఆడవాళ్ళూ, పిల్లలూ ఏడుపులు ఆపేశారు.

అకస్మాత్తుగా నిశ్శబ్దం ఆవరించింది. మేళగాళ్ళు వచ్చి, "అయ్యా... మిగిలిన డబ్బులిచ్చి పంపించేయండి మమ్మల్ని!" అన్నారు.

"మమ్మల్ని కూడా పంపించేయండి!" అన్నారు భజన బృందం.

"ఉండండి- తొందర పడితే ఎలా? ఆవిడ పోనీండి..!" అన్నాడు ప్రభాకరం చిరాకుగా.

"మీరు చెప్పింది 12:35కి! ఆ తర్వాత వెళ్లిపోవచ్చన్నారు. ఇప్పుడు ఒంటిగంట దాటింది. ఇంకెంతసేపు ఉండమంటారు? మాకు రెండు గంటలకి మరో బేరం ఉంది" అన్నారు వాళ్ళు.

"అయితే... మీకిచ్చిన అడ్వాన్సుతో సరిపెట్టుకొని వెళ్లిపోండి!" అన్నాడు ప్రభాకరం.

"అదెలా కుదురుతుందండీ? ఆవిడ పోవడం, మానడం మాకు అనవసరం. మాట్లాడినదల్లా ఇచ్చేయండి. లేదూ... ఆవిడని చచ్చిపోమనండి- వాయించి మరీ వెళ్తాం."

"ఆవిడ చచ్చిపోలేదుగా... సగం తీసుకుని వెళ్లిపోండి!"

"అదేం కుదరదు. కావాలంటే ఈసారి మీ ఇంట్లో ఇంకెవరైనా చచ్చిపోయినప్పుడు తగ్గిస్తాం!"

"అయితే... మీ అందరూ ఆవిడకి తెలివి వచ్చాక ఆవిడ దగ్గర తీసుకోండి. ఇవన్నీ ఆవిడకోసమేగా!"

"అవన్నీ మాకు అనవసరం. మాట్లాడింది మీరు- మిమ్మల్నే అడుగుతాం!"

ఇంక లాభం లేదనుకుని ఇద్దరికీ డబ్బులిచ్చి పంపించేశాడు ప్రభాకరం.

"అయ్యా... మరి, నన్నూ..." అంటూ నీళ్లు నమిలాడు పేరయ్య శాస్త్రి.

మారు మాట్లాడకుండా ఆయనకీ ఇచ్చి పంపించివేశాడు.

"అయ్యా... పాడె, చావు సామాను ఏంచేయమంటారు?" అన్నాడు వెట్టివాడు.

"ఓ మూల తగలేయ్! అందరూ దొరికారు- నా ప్రాణానికి!" అంటూ అరిచాడు ప్రభాకరం.

సావిత్రమ్మగారు అటూఇటూ కదిలింది. ఉన్నట్లుండి అమాంతం లేచి కూర్చుంది. అందరూ ఉలిక్కిపడ్డారు.


"ఏమిట్రా- పుష్పకవిమానంలో స్వర్గానికి వెళుతుంటే భూమ్మీదకు లాక్కొచ్చారా?" అంది.

"అఘోరంచిట్టుందిలే... నీ స్వర్గయాత్ర!" అని గయ్యిమన్నాడు ప్రభాకరం.

"ఒరేయ్... నా కొడుకులకీ, కోడళ్లకీ, కూతుళ్లకీ, అల్లుళ్లకీ నామీద ఎంత ప్రేముందో నాకు తెలుసు. మీ అందరూ చూపిన ప్రేమను భరించలేకనే కదా... ఒక్కతినీ కాలక్షేపం చేస్తోంది! ఇప్పటికైనా మీలో ఏ ఒక్కరిలోనైనా మార్పు వచ్చిందేమో..., వస్తే- వాళ్ళకి నా ఆస్తి కట్టబెట్టి చివర రోజులు వాళ్ళ దగ్గర గడపాలనుకున్నా. కాని, ఈ నాలుగురోజులు మీ చర్చలూ, మాటలూ గమనించాక నాపట్ల ప్రేమ సరే... బాధ్యత కూడా ఎవరికీ లేదు. మీ అందరి సంగతి స్వయంగా తెలుసుకోవాలనే ఈ స్వర్గయాత్ర నాటకం ఆడాను. నాకు ఓపిక తగ్గిపోయింది. ఈ ఊళ్లో వృద్ధాశ్రమం ఉంది. అందులో దిక్కులేని ముసలివాళ్ళకు నిస్వార్థంగా సేవలు చేస్తున్నారు. ఈ ఇల్లూ, నా ఆస్తీ వాళ్ళకే రాసేస్తాను. ఇప్పుడు వాళ్ళు అద్దె ఇంట్లో ఉంటున్నారు. ఈ ఇల్లు బాగుచేయించి వాళ్ళకి ఇచ్చేస్తాను. అప్పుడు వాళ్ళు ఇక్కడికే వస్తారు. ఈ ఇంట్లోనే నేను కడతేరిపోతాను. ఈరోజు నేను స్వర్గంలాంటి ఆశ్రమంలోకి వెళ్లిపోతున్నాను. అదే నా నిజమైన స్వర్గయాత్ర!" అంటూ సామాను సర్దుకోవడానికి లోనికి వెళ్లింది సావిత్రమ్మ.

*- జాగృతి... దీపావళి ప్రత్యేక సంచిక ' 2000*

## లౌక్యం



"హలో.. సిస్టర్! 406 బెడ్ మీదున్న వీరభద్రయ్యగారి పరిస్థితి ఎలావుందో చెప్తారా! ఆయనకి వారం క్రితం ఆపరేషన్ చేశారు."

"ఒక్క నిమిషం- కేస్‌షీట్ చూసి చెప్తాను.. ఆ.. ఆయన బాగా కోలుకుంటున్నారు. ఇంతకీ, మీరు ఆయనకేమవుతారు?"

"406 బెడ్ మీదున్న ఆ వీరభద్రయ్యను నేనేనమ్మా! నా పరిస్థితి గురించి అడిగితే డాక్టర్‌గారు చెప్పడం లేదు. అందుకనే బయటనుంచి మీకు ఫోన్ చేస్తున్నాను."